భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL
27, అక్టోబర్ 2026, మంగళవారం
భారత్ సమాచార్

# బీసీ స్టడీ సర్కిళ్లలో కీలక మార్పులు.. ఉద్యోగాలే టార్గెట్‌గా ట్రైనింగ్



**భారత్ సమాచార్, హైదరాబాద్:** బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, వేగంగా అందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించడం, నిరుద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని సచివాలయంలో అక్టోబర్ 27న బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

## విదేశీ విద్యా పథకంలో పారదర్శకత

మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన మెరిట్ విద్యార్థులకు ప్రయోజనాలు అందించే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ భవనాలకు సంబంధించి అవసరమైన పరిపాలనా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని తెలిపారు.

## డిసెంబర్ 9న కుట్టు మిషన్ల పంపిణీకి ప్రణాళిక

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకంపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన వచ్చిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేందుకు అవసరమైన

కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియతో పాటు ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను కూడా మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.

## 301 గురుకులాలకు సొంత భవనాలే లక్ష్యం

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి సమర్పించిన నివేదికలపై మంత్రి సమీక్షించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది వివరాలు, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల పరిస్థితులను పరిశీలించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధుల మంజూరు అంశాలను ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు. మిగిలిన గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

గురుకుల పాఠశాలలను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు నెలకు కనీసం ఒక గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల్లోని సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు వెల్లడించారు.



గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు ఈ విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా వివరించేలా ప్రోత్సహించాలని తెలిపారు.

## బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు

బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా కొత్త సంస్కరణలు అమలు చేయాలని సూచించారు.

స్టడీ సర్కిళ్ల నిర్వహణను మెరుగుపరిచేందుకు సమర్థులైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ఎంపిక కమిటీ ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ రూపొందించాలని సూచించారు.

## స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం

బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ కేంద్రాల ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆయా వర్గాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

## రజకులకు ఆధునిక ధోబీఘాట్లు

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బలహీనవర్గాల ఐకాన్‌లుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలకు పేర్లు రాయించే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై కూడా సమీక్ష నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రక్షణ కవచాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా కేఫ్‌లు, నందనవనాల నిర్వహణ, అభివృద్ధిపై చర్చిస్తూ అధికారులు స్వయంగా ఆయా ప్రాంతాలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు.

బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలు అర్హులకు సమర్థవంతంగా చేరేలా, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెరిగేలా, నిరుద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందేలా, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar